క్లుప్తంగా

నేడు మండల సభ

జమ్మికుంట: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొడ్డె మమతప్రసాద్ అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో భీమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు వివిధశాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని పేర్కొన్నారు.

ఔషధ మొక్కలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జ్యోతిరాణి

జమ్మికుంట: ఔషధ మొక్కలతో వ్యాధుల నియంత్రణపై కవి సాయంత్రం గ్రూపు ప్రచార కార్యదర్శి జ్యోతిరాణి ఆదివారం పట్టణంలోని కాలనీవాసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా చుట్టుపక్కల ప్రాంతాల్లో పెరిగే ఔషధ మొక్కలతో మాత్రలు తయారు చేసుకొని, వాటితో వ్యాధులను నయం చేసుకునే విషయాల గురించి వివరించారు.

అంచెలంచెలుగా ఎదగాలి

మానకొండూర్: రాజకీయాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు అంచెలంచెలుగా ఎదగాలని, ఆయనకు కేసీఆర్ ఆశీస్సులు మెండుగా ఉన్నాయని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మానకొండూర్‌లో జీవీఆర్ జన్మదిన వేడుకలకు హాజరయ్యారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అనంతరం మాట్లాడారు. జీవీఆర్ ప్రజల మనిషి, తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించాడని, ప్రజల ఆదారాభిమానాలు పొందిన వ్యక్తి అని కొనియాడారు. భవిష్యత్‌లో మరిన్ని పదవులు పొందాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జిల్లా పరిషత్తు మాజీ చైర్మన్ తుల ఉమ, నాయకులు అడప శ్రీనివాస్, రామంచ గోపాల్‌రెడ్డి, రొడ్డ పృథ్వీరాజ్, గుర్రం కిరణ్‌గౌడ్, దండబోయిన శేఖర్, దండు రాములు, మర్రి కొండయ్య, పిండి సందీప్, రవి, ఎలగందుల సుదర్శన్, గంప వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

సైదాపూర్: ఎంపీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని దుద్దెనపల్లిలో కేంద్ర బలగాలు, సైదాపూర్ పోలీసులు ఆదివారం వాహనాలు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎస్‌ఐ ఆరోగ్యం మాట్లాడారు. అనుమతులు లేకుండా డబ్బు తరలిస్తే, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

దుస్తుల పంపిణీ

హుజూరాబాద్: రంజాన్ పురస్కరించుకొని నిరుపేద మహిళలకు తెలంగాణ ముస్లిం ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఆధ్వర్యంలో సుమారు వందమందికి ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముస్లిం నాయకులు భాషుమియా, అలీమ్, గౌస్ ఖాన్, మురాద్ హుస్సేన్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత



బియ్యం అందిస్తున్న పద్మశాలీ సంఘం సభ్యులు

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామానికి చెందిన గుంటుక వెంకవ్వ ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబసభ్యులను ఆదివారం పద్మశాలీ సంఘం సభ్యులు పరామర్శించారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో ఇరవైఐదు కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు లింగయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి లక్ష్మణ్‌రావు, ఆడెపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరామర్శ

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు బోర్నపల్లిలో శుక్రవారం టిప్పర్ బోల్తా పడటంతో ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులను కాంగ్రెస్ హుజూరాబాద్ పట్టణ మహిళా నాయకురాలు పుష్పలత, నాయకులు పరామర్శించారు.

ఉచిత కోచింగ్

కరీంనగర్: అభయ రామన్ సొసైటీ(ఏఆర్ అకాడమీ)ఆధ్వర్యంలో గ్రూప్‌–2, ఆర్ఆర్‌బీ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు నెల రోజుల పాటు అడ్మిషన్ ఫీజుతో క్లాసులు నిర్వహిస్తున్నట్లు ఏఆర్ అకాడమీ డైరెక్టర్ భూపెల్లి లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అడ్మిషన్ ఫీజు ఈనెల 12వ తేదీ వరకు రూ.1000 చెల్లించవచ్చునని తెలిపారు. వివరాలకు 8520946155, 9490963155 నంబర్లు సంప్రదించాలన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



గన్నేరువరం: మాదాపూర్‌లో పోచమ్మ బోనాలతో మహిళలు

గన్నేరువరం: మండలంలోని మాదాపూర్ గ్రామంలో ఆదివారం శ్రీరాజరాజేశ్వర మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నెత్తిన బోనంతో డప్పుచప్పుళ్ల మధ్య గ్రామ వీధుల గుండా పోచమ్మ ఆలయానికి చేరుకుని బోనాలు, నైవేద్యం సమర్పించారు. పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలనుచల్లగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మాధరి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జునస్వామి కళ్యాణం

చొప్పదండి: మండలంలోని శ్రీగట్టు మల్లికార్జున స్వామి ఆలయ వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. పట్నం వేసి భ్రమరాంబ సమేత గట్టు మల్లికార్జునస్వామి కల్యాణం, ఉగాది అగ్ని గుండాల కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు, చొప్పదండి, కొలిమికుంట, మల్లన్నపల్లి గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాలు నిర్వహించారు. నెత్తిన బోనంతో మహిళలు ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సైదాపూర్: మండలంలోని లస్మన్నపల్లి గ్రామంలో ఉగాది పర్వదినం పురస్కరించుకొని రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మతల్లి బోనాలు నిర్వహించారు. పోతరాజు వేషాలు, శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనంతో అమ్మవారి ఆలయానికి ఊరేగింపుగా తరలివెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. పాడిపంటలు, పిల్లాపాపలను చల్లంగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. రెడ్డి సంఘం నాయకులు కొట్టె వెంకటరెడ్డి, పొల్సాని రాంరెడ్డి, మ్యాకల మల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కొంపెల్లి రాజిరెడ్డి, జూల మహేందర్‌రెడ్డి సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: చిగురుమామిడి మండలం రేకొండ గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. రెడ్డి సంఘం అధ్యక్షుడు బిల్ల మల్లారెడ్డి, రొంటాల ప్రతాప్‌రెడ్డి, కల్వల సంపత్‌రెడ్డి, బిల్ల రత్నాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మహేందర్‌రెడ్డి, చాడ అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

గంగిపల్లిలో మల్లన్నకు పెద్దపట్నం

మానకొండూర్: మండలంలోని గంగిపల్లిలో ఏదుగుట్ట మల్లికార్జునస్వామికి యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పెద్దపట్నం వేసి ముడుపు చెల్లించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని పట్నాలు వేసి బోనాలు సమర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గిన్నీస్ బుక్ రికార్డు గ్రహీత రాపల్లి శ్రీనివాస్ హాజరు కాగా ఆయనను సన్మానించారు. ఆలయ చైర్మన్ సంపత్ రెడ్డి, యాదవ సంఘం అధ్యక్షుడు జిల్లెల్ల పర్శరాములు, కార్యదర్శి చౌదరి ఐలయ్య, నూకల పోషాలు, రాధారపు సరోజన, జక్కుల శ్రీలత, జెట్టి కొమురయ్య, బొడ్డు తిరుపతి, రాదరపు సమ్మయ్య, జక్కుల సంపత్ పాల్గొన్నారు.



తిమ్మాపూర్:బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



సైదాపూర్ : బోనాలు సమర్పించిన భక్తులు



మానకొండూర్: గంగిపల్లిలో మల్లికార్జునస్వామికి పెద్దపట్నం



చొప్పదండి: పట్నం వేస్తున్న పూజారులు

వైద్య శిబిరాలకు స్పందన





జమ్మికుంట: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సురేశ్, మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది



రామడుగు: వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న నాయకులు

జమ్మికుంట: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సంజీవని మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పట్టణం, మండలంలోని 500 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. శిబిరాన్ని ప్రజలు, రోగులు సద్వినియోగం చేసుకున్నారు. వైద్యులు, హాస్పిటల్ నిర్వాహకులను పట్టణ ప్రముఖులు అభినందించారు. డా.ఉడుగుల సురేశ్, ఎంఎస్ జనరల్ (మెడిసిన్), డా.అనిత ఎంఎస్ జనరల్ (సర్జన్), కిషోర్‌కుమార్ ఎండీ(చెస్ట్), డా.ప్రణీత ఎంఎస్(ఓబీజీ),డా.సురేశ్ ఎంఎస్(ఆర్థో), మేనేజ్‌మెంట్ కిరణ్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

తిమ్మాపూర్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామ పంచాయతీ ఆవరణలో కరీంనగర్ మహాదేవ దీపిక హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఆర్. వెంకటేశ్వర్లు గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేశారు. షుగర్, ఊపిరితిత్తుల, గుండె తదితర వ్యాధులకు సంబంధించి సుమారు 250 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు విజయ మోహన్‌రెడ్డి, రఘురాం, వైస్ ఎంపీపీ ల్యాగల వీరారెడ్డి, కనపర్తి చంద్రశేఖర్, గొల్లపల్లి మల్లేశం, బోయిని సతీశ్, గంగారపు అశోక్, తమ్మనవేణి శ్రీనివాస్, కొర్రి వంశీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. బీఆర్ఎస్ యువజన విభాగం ఉపాధ్యక్షులు బుదారపు కార్తీక్ ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, ఆశ వర్కర్లను సన్మానించారు. ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, పద్మశాలీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక కమలాకర్, నాయకులు ఎడవెల్లి పాపిరెడ్డి, పురాణం రమేశ్, పొన్నం నరేందర్, మిరియాల నిశాంత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



తిమ్మాపూర్: శిబిరంలో వైస్‌ఎంపీపీ వీరారెడ్డి, వైద్యులు

బీజేపీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ బండి సంజయ్

శంకరపట్నం: మండలంలోని బీఆర్ఎస్ నాయకులు ఆదివారం కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఖాజాపాషా, అర్కండ్ల మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్, తెలంగాణ ఉద్యమకారుడు రాసమల్ల శ్రీనివాస్, కనుకుంట్ల శ్రీనివాస్, తదితరులు కాషాయ కండువా కప్పుకున్నారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించొద్దు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

జమ్మికుంట: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని గౌరవించే పార్టీకే ఓటు వేద్దాం అని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని మానవ హక్కుల వేదిక రాష్ట్ర కమిటీ సభ్యులు ముక్క ఐలయ్య అన్నారు. పట్టణంలో మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు విద్వేష రాజకీయాలు పెరిగిపోతున్నాయని, రాజ్యాంగం, ప్రజల హక్కులపై పాలకులకు కనీస గౌరవం లేకుండా పాలన కొనసాగుతుందన్నారు. నిరుద్యోగం, పేదరికం, దేశఆర్థిక స్థితిగతులు దిగజారిపోతున్నాయని అన్నారు. దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీలు లేకుండా చేయడం, మత విద్వేషాలు రెచ్చగొట్టడం, హక్కుల గురించి మాట్లాడే వారి గొంతు నొక్కుతున్నారని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించే పార్టీలను ప్రజలు ఆదరించకూడదని,రాజ్యాంగాన్ని ప్రజలను గౌరవించే పార్టీలను గెలిపించాలని, అటువంటి పార్టీలు లేకపోతే నోటాకు ఓటు వేయాలని పిలుపునిచ్చామన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కమిటి సభ్యులు, అచ్యూత్‌కుమార్, ఎం కిరణ్, సదానందం, కొత్తూరు కుమార్‌లు పాల్గొన్నారు.



మండే ఎండల్లో నీరంతా వృథా

మానకొండూర్: మండుటెండల్లో మండల కేంద్రంలో తాగునీటి పైపులైన్‌కు తరచూ లీకేజీలు అవుతున్నాయి. తూర్పు దర్వాజ చౌరస్తా వద్ద లీకేజీతో తాగునీరు వృథాగా పోతోంది. అలాగే కరీంనగర్–వరంగల్ ప్రధాన రహదారి పల్లెమీద తాగునీటి సరాఫరా పైపులైన్ లీకేజీతో తాగునీరు కలుషితమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

గన్నేరువరం: మండలంలోని గన్నేరువరం, ఖాసీంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్‌లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న నేపథ్యంలో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ శాఖ ఏఈ ఆంజనేయులు ఆదివారం ప్రకటనలో తెలిపారు. గన్నేరువరం, ఖాసీంపేట, పారువెల్ల, చొక్కారావుపల్లె, యాస్వాడ, మైలారం, చాకలివానిపల్లె, మైలారం, సాంబయ్యపల్లె గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ప్రజలు, రైతులు సహకరించాలని కోరారు.

మానకొండూర్: మండలంలోని లింగాపూర్, పోచంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరాఫరా నిలిపివేస్తామని మానకొండూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ షఫీహైమద్ తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరాఫరా నిలిపి వేయడం జరుగుతుందని ఈ సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రెడ్డి సంఘం కార్యవర్గం

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ గ్రామం రెడ్డి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా కొస్న తిరుపతిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఇనుకొండ రమణారెడ్డి, వెల్మ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెల్మ రఘుపతిరెడ్డి, సహాయ కార్యదర్శిగా ఎడవెల్లి రాజేందర్‌రెడ్డి, కోశాధికారిగా రూపిరెడ్డి హన్మంతరెడ్డి ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షులుగా ముష్కె వెంకట్ రెడ్డి, అప్పిడి శ్యాంసుందర్‌రెడ్డి, వెల్మ బాపురెడ్డి, గుజ్జుల జగన్ రెడ్డిలు నియామకమయ్యారు.

- చిగురుమామిడి గౌడ సంఘం తాత్కాలిక అధ్యక్షుడిగా చంద్రం



తిమ్మాపూర్: చిగురుమామిడి మండల గౌడ సంఘం తాత్కాలిక అధ్యక్షుడిగా బండారుపల్లి చంద్రం ఎన్నికయ్యారు. సంఘం మండల అధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతిగౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం సంఘం సమావేశం ఏర్పాటు చేశారు. త్వరలో మండల కమిటీని ఎన్నుకునేందుకు తీర్మానించారు. సమావేశంలో సంఘం నాయకులు విజ్జగిరి, బొమ్మగాని వెంకటేశం, బుర్ర తిరుపతి, సుదగోని సుదర్శన్, బుర్ర పరశురాములు, గట్టు మధు, తాళ్లపల్లి సంపత్, బత్తిని మల్లేశం, బుర్ర శ్రీనివాస్, తాళ్లపల్లి భాస్కర్ పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

- మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

తిమ్మాపూర్: మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ అని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఎల్ఎండీకాలనీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముస్లింలకు ఆదివారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఇచ్చారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి ముస్లింలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సన్మార్గంలో నడుస్తూ, దేవుని యందు భక్తివిశ్వాసం ఉన్నవారు కర్మానుసారం మంచి జీవితం పొందగలుగుతారని, అల్లా అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని, సుఖసంతోషాలతో జీవితం ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు ముస్లిం మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేసి ఎమ్మెల్యేకు దీవెనలు అందజేశారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. క్యాంపు కార్యాలయం సమీపంలోని అరుంధతి కల్యాణమండపంలో మానకొండూరు నియోజకవర్గ మండలాల జర్నలిస్టులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే జూన్ 10 వరకు విలేకరులకు పట్టాలిచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి విలేకరులు వారధిగా ఉండాలని, ప్రజా సమస్యలను తనదృష్టికి తీసుకురావాలని, తప్పులను నిర్భయంగా రాయాలన్నారు. ప్రభుత్వ ప్రైవేటు భూములను కబ్జా చేసిన వారిపై ఉక్కుపాదం మోపుతామాని, ప్రభుత్వ భూముల పరిరక్షణకు పాత్రికేయులు తమవంతు తోడ్పాటు అందించాలన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలతో పాటు జర్నలిస్టులు కూడా అణిచివేత కు గురయ్యారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో జర్నలిస్టులకు పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

కలుషిత నీటితో దురదంటూ గ్రామస్తుల ఆందోళన

సైదాపూర్: కలుషిత నీటితో ఇబ్బందులు పడుతున్నామని, ఆ నీళ్లతో స్నానం చేస్తే దురద పెడుతుందంటూ గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ.. మండలంలోని సోమారం గ్రామ పరిధి గర్రెపల్లిలోని మంచినీటి బావిలో నీరు తొలగించాలన్నారు. నల్లాల బావిలో నీరు అడుగంటి పోవడంతో నీరు కలుషితమైందని, గర్రెపల్లెకు కనీసం మిషన్ భగీరథ వాటర్ కుడా రావడం లేదని , దీంతో తాగునీటికి తంటాలు పడుతున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి మంచినీళ్ల బావిలో పూడిక తీయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఆందోళనలో ఎనమల్ల రమేశ్, దొకిడి తిరుపతి, వేముల రమేశ్‌బాబు, సుంక సంపత్, శోభ, లక్ష్మి, నరసమ్మ, వెంకటస్వామి తదితరులు ఉన్నారు.

ఆకట్టుకున్న శ్రీసీతారాముల పట్టాభిషేకం



చిడుతల రామాయణ కళాకారులు, సహకారం అందించినవారిని సన్మానిస్తున్న గ్రామస్తులు

జమ్మికుంట: మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలో నాలుగు రోజులుగా చిడుతల రామాయణం ప్రదర్శిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి శ్రీసీతారాముల పట్టాభిషేక మహాఘట్టం వైభవంగా నిర్వహించారు. అన్నదమ్ముల అనుబంధం, తండ్రికొడుకులకు మధ్య ఉన్న సంబంధాలను కళాకారులు కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శించారు. అనంతరం కాకతీయ విద్యా సంస్థల అధినేత అవిర్నేని సుధాకర్‌రావు ఆధ్వర్యంలో భక్తులు, గ్రామప్రజలకు మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. చిడుతల రామాయణం ప్రదర్శనకు సహరించిన వారిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రా మాయణ గురువు బోళ్ల కొమురయ్య, సహాయకులు పడాల సత్యనారయణ, కళాకారులు హుస్సేన్, భిక్షపతి, సీతమల్లన్న, మోహన్‌రెడ్డి, రాజుతోపాటు జగ్గయ్యపల్లి సాంస్కృతిక సమైక్య అధ్యక్షుడు, ఉపాధక్ష్యుడు, కమిటీ, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.